సాక్షి సూర్యాపేట

గురువారం । 21 । డిసెంబర్ । 2023



పోస్టాఫీసులో డిపాజిట్లు మాయం
నందికొండ మున్సిపాలిటీ పరిధి హైలాన్ కాలనీలోని సబ్‌పోస్టాఫీసులో సుమారుగా రూ.20లక్షలు మాయమయ్యాయి. - 10లో



గంజాయి రవాణాకు అడ్డేది?
గంజాయి, డ్రగ్స్ వినియోగంపై ప్రభుత్వం సీరియస్‌గా ఉండడంతో నిఘా కట్టుదిట్టం చేయనున్నారు. - 8లో



గురుకులం పిలుస్తోంది
గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలకు గురుకుల విద్యాలయాల సంస్థ నోటిఫికేషన్ విడుదల చేసింది. - 10లో

న్యూస్‌రీల్

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మహిళలకు అవగాహన కల్పిస్తున్న చైతన్య

మునగాల: మహిళలు అన్ని రంగాలలో రాణించాలని , చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మహిళా సాధికారత కేంద్రం డిస్ట్రిక్ట్ మిషన్ కోఆర్డినేటర్ చైతన్య అన్నారు. బుధవారం మునగాల మండల కేంద్రంలోని రాళ్లబావి అంగన్‌వాడీ కేంద్రం–4లో ఆమె మహిళలు, యువతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో మహిళల హెల్ప్‌లైన్ నంబర్లు, సుకన్య సమృద్ధి యోజన, ప్రధానమంత్రి మాతృ వందన యోజన, పీసీపీ ఎన్డీపీ యాక్ట్, పని ప్రదేశంలో లైంగిక వేధింపులు, రుతుక్రమ పరిశుభ్రత నిర్వహణతో పాటు రాజ్యాంగం ద్వారా కల్పించిన హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో జెండర్ స్పెషలిస్టు కుక్కడపు వినోద్, అంగన్‌వాడీ కేంద్రం–4 టీచర్ సంధ్యారాణి పాల్గొన్నారు.

న్యాయం చేయాలని అధికారులకు వినతి




వినతిపత్రం అందజేస్తున్న దళిత బంధు లబ్ధిదారులు

తిరుమలగిరి (తుంగతుర్తి) : దళిత బంధు పథకంలో వెండర్ తమను మోసం చేశాడని, తమకు రావాల్సిన డబ్బులు పూర్తిగా ఇవ్వలేదని తిరుమలగిరి మండలంలోని బండ్లపల్లి గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులు బుధవారం కలెక్టర్ కార్యాలయంలో, ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తిరుమలగిరికి చెందిన వెండర్ దళిత బంధు పథకంలో ఒక్కొక్కరికి రూ.7.30లక్షలు మాత్రమే ఇచ్చారని, జీఎస్టీ పేరుతో తమ డబ్బులను కాజేశారని ఆరోపించారు. దళిత బంధు యూనిట్లలో ప్రభుత్వం తమకు ఇచ్చిన రూ.10లక్షల్లో వెండర్ పూర్తిగా డబ్బులు ఇవ్వలేదని, జీఎస్టీ పోను మిగతా డబ్బులు ఇప్పించాలని, వెండర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కోక సరిత, యాదమ్మ, మల్లమ్మ, మరియమ్మ, మాధవి, నాగలక్ష్మి, ఏపూరి పద్మ, చెరుకు రేణుక, ఏపూరి యాదమ్మ ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడుదాం

చిట్యాల : పర్యావరణ పరిరక్షణలో ప్రజలంతా భాగస్వాములు కావాలని సీఆర్‌ఐడీఏ (భారత కేంద్ర మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ) శాస్త్రవేత్త డాక్టర్ ఏనుగు అమరేందర్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాలలోని సెయింట్ మేరీస్ హైస్కూల్‌లో బుధవారం విద్యార్థులకు పర్యావరణంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకంతో పాటు ఆ వ్యర్థాలతో జరిగే నష్టాన్ని విద్యార్థులకు వివరించారు. అనంతరం స్కూల్ ఆవరణలో స్వచ్ఛ భారత్ కార్యక్రమంను నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మందడి రామదుర్గారెడ్డి, సీఆర్‌ఐడీఏ శాస్త్రవేత్తలు డాక్టర్ బాసుదేబ్‌సర్కార్, డాక్టర్ కేఏ.గోపినాథ్, స్కూల్ ప్రిన్సిపాల్ గట్టు అలెగ్జాండర్ రెడ్డి, అరవిందో స్కూల్ ప్రిన్సిపాల్ మహ్మద్ జమీరుద్దీన్, డైరెక్టర్లు బోళ్ల జానకిరాంరెడ్డి, సీలివేరు యాదగిరి, ఏనుగు యాదగిరిరెడ్డి, ఏరుకొండ పద్మ తదితరులు పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశికి మట్టపల్లి ముస్తాబు



ముస్తాబైన మట్టపల్లి ఆలయం

మఠంపల్లి : ఈనెల 22, 23 తేదీల్లో నిర్వహించే ముక్కోటి ఏకాదశి ఉత్సవాలకు మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం ముస్తాబైంది. 22న సాయంత్రం మంగళవాయిద్యం, వేద మంత్రపఠనం, నృసింహ నామసంకీర్తన తో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 23న ప్రాతఃకాలార్చన, సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం నిర్వహించి 5 గంటలకు వైకుంఠద్వార దర్శనం చేస్తారు. అనంతరం గర్భాలయంలో లక్షపత్రిపూజ, గ్రామోత్సవం, ఆలయప్రవేశం, రాత్రి మట్టపల్లి క్షేత్రమహత్యం, బుర్రకథతో కార్యక్రమాలు ముగుస్తాయి.

ఇక్కత్ కళ అద్భుతం

పోచంపల్లి చేనేత ఉత్పత్తులను పరిశీలించిన రాష్ట్రపతి
- శ్రీరంజన్ సిల్క్ వీవ్స్ యూనిట్, పెవిలియన్ థీమ్ సందర్శన
- వస్త్రాల తయారీ విధానంపై ఆసక్తి
- చేనేత కళాకారులతో ద్రౌపదీ ముర్ము మాటామంతీ



మహిళలు చరఖాలతో నూలు వడకడాన్ని పరిశీలిస్తున్న రాష్ట్రపతి ద్రౌపదీముర్ము

సాక్షి, యాదాద్రి/భూదాన్‌పోచంపల్లి : పోచంపల్లి ఇక్కత్‌కళ ఎంతో అద్భుతంగా ఉందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము కొనియాడారు. బుధవారం ఆమె భూదాన్‌పోచంపల్లిని సందర్శించారు. మొదట ఆమె శ్రీరంజన్ సిల్క్ వీవ్స్ యూనిట్‌ను సందర్శించి దారం నుంచి వస్త్రం తయారయ్యే ప్రక్రియలను స్వయంగా పరిశీలించారు. కూకున్స్ నుంచి సింగిల్ యారన్ దారం తయారీ, దారాన్ని డబులింగ్, ట్విస్టింగ్, వార్పింగ్, వెఫ్టింగ్ చేసి చివరకు 2ప్లై దారాన్ని ఎలా తయారు చేస్తారో తెలుసుకున్నారు. పట్టుగూళ్ల నుంచి ముడి పట్టును తీసి, మేలు రకమైన పట్టుదారం తయారు చేయడం, దాని నుంచి పడుగు, పేకలను రూపొందించి రంగులద్ది, టై అండ్ డైలో డిజైన్లను రూపొందించడం, ఆసు యంత్రాపై చిటికిపోసి పలు రకాల డిజైన్లతో చీరలు తయారు చేయడం తదితర విషయాలను శ్రీరంజన్ వీవ్స్ యజమాని ఎన్నం శివకుమార్ రాష్ట్రపతికి వివరించారు. రాష్ట్రపతి స్పందిస్తూ.. ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో టస్సార్ సిల్క్‌ను వినియోగిస్తారని, కానీ మల్బరీ సిల్క్ నాణ్యత బాగుందని తన స్వరాష్ట్రమైన ఒడిశాలో కూడా మల్టీ హ్యాండ్లూమ్ యూనిట్లు నెలకొల్పేందుకు తన పర్యటన ఎంతో దోహదపడిందని అభిప్రాయపడ్డారు.



చేనేత చీరలను పరిశీలిస్తున్న రాష్ట్రపతి ద్రౌపదీముర్ము

థీమ్ పెవిలియన్‌లో పర్యటన

రాష్ట్రపతి పర్యటన సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పెవిలియన్ థీమ్‌లో చేనేతకు సంబంధించిన పలు వస్త్రాల తయారీపై చేనేత కళాకారులు రాష్ట్రపతికి వివరించారు. పుట్టపాకకు చెందిన పద్మశ్రీ అవార్డు గ్రహీతలు.. నూనెలో దారాన్ని నానబెట్టి ప్రాసెసింగ్ చేసి తేలియారుమాల్ వస్త్రాన్ని తయారు చేసే విధానాన్ని వివరించారు. తేలియా రుమాల్‌కు జియోగ్రాఫికల్ ఇండికేషన్ లభించిందని చెప్పారు. భూదాన్‌పోచంపల్లి డబుల్ ఇక్కత్ చీరలు, గద్వాల సిల్క్ చీరలు, వరంగల్ రామప్ప చీర, భూపాలపల్లి టస్సర్ చీరలు, సిద్దిపేట గొల్లభామ చీరల గురించి చేనేత జౌళిశాఖ డీడీ అరుణ్‌కుమార్ వివరించారు. నారాయణపేట సిల్క్, కాటన్ చీరలు, వరంగల్ దుర్రీస్ తివాచీలు, 14వ శతాబ్దం మొఘల్ సామ్రాజ్యంలో ఔరంగాబాద్‌లో నేసిన హిమ్రూ చీరల (అప్పట్లో రాయల్ ఫ్యామిలీలకు బహుమతిగా ఇచ్చేవారు) గురించి జౌళిశాఖ డీడీ వెంకటేశం రాష్ట్రపతికి వివరించారు.

ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు

ఇక్కత్ వస్త్రాలు, గద్వాల చీరలు, గొల్లభామ చీరల కోసం ఏర్పాటు చేసిన స్టాల్‌ను రాష్ట్రపతి సందర్శించారు. చేనేత కళాకారులు ఆమెకు ఆయా వస్త్రాల తయారీ గురించి చెప్పారు. ఆన్‌లైన్ మార్కెటింగ్‌లో వస్త్రాల అమ్మకం గురించి సాయిని భరత్, ఎన్‌జీఓ సుధ రాష్ట్రపతికి వివరించారు. పడుగు, పేకల కోసం వినియోగించే 30 చరఖా (రాట్నం)లను మహిళలు తిప్పుతుండగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము వాటిని పరిశీలించారు. చరఖా పనితీరును అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేకంగా రూపొందించిన మగ్గంపై నేత తీరును పరిశీలించారు. పద్మశ్రీ చింతకింది మల్లేషం రూపొందించిన ఆసు యంత్రాన్ని పరిశీలించి దాని పనితనాన్ని అడిగి తెలుసుకున్నారు.

ఆప్యాయంగా పలకరిస్తూ..

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము శ్రీరంజన్ వీవ్స్ మల్టీ యూనిట్‌లో పనిచేస్తున్న చేనేత కార్మికుల వద్దకు వెళ్లి ఒక్కొక్కరిని ఎంతో ఆప్యాయంగా పలకరించారు. ఎన్ని సంవత్సరాలుగా మగ్గం పనిచేస్తున్నారని, ఈ వృత్తి వల్ల నెలకు ఎంత కూలి లభిస్తుందని అడిగి తెలుసుకున్నారు. ఒడిశా చేనేత కళాకారులను తాము మెహర్ అని పిలుచుకుంటున్నామని చెప్పారు. ఇక్కడి చేనేత కళాకారుల నేత నైపుణ్యం గొప్పగా ఉందని కొనియాడారు. అనంతరం చేనేత కార్మికులతో కలిసి గ్రూప్ ఫొటో దిగారు. ఈ సందర్భంగా శ్రీరంజన్ వీవ్స్ యజమాని ఎన్నం శివకుమార్ దంపతులు రాష్ట్రపతికి సంబల్‌పురి డిజైన్ కలిగిన పోచంపల్లి ఇక్కత్ చీర, పోచంపల్లి డబుల్ ఇక్కత్ చీరను అందజేశారు. రాష్ట్రపతి వెంట రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, సీతక్క, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ సెక్రటరీ రచన సాహు, రాష్ట్ర చేనేత జౌళి శాఖ డైరెక్టర్ అలుగు వర్షిణి, భువనగిరి కలెక్టర్ హనుమంత్ కె.జెండగే ఉన్నారు.

పోచంపల్లిలో రెండు గంటలు గడిపిన రాష్ట్రపతి

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము భూదాన్‌పోచంపల్లిలో రెండుగంటల పాటు గడిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రత్యేక చాపర్‌లో పోచంపల్లికి చేరుకున్నారు. శ్రీరంజన్ వీవ్స్ యూనిట్‌లో 20 నిమిషాల పాటు వీవింగ్, ట్విస్టింగ్ ప్రక్రియలను పరిశీలించారు. 10.55 గంటలకు బాలాజీ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన థీమ్ పెవిలియన్‌ను సందర్శించారు. అనంతరం గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చరఖా రూమ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా భూదానోద్యమ పిత ఆచార్య వినోబాభావే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం భూదానోద్యమ చరిత్ర ఫొటో గ్యాలరీని తిలకించారు. అక్కడి నుంచి 11.30 గంటలకు సభావేదిక వద్దకు చేరుకున్నారు. చేనేత కార్మికులచే సన్మానం పొందారు. 12.15 గంటలకు రాష్ట్రపతి చేనేత కార్మికులనుద్దేశించి పది నిమిషాలు మాట్లాడారు. అనంతరం 12.30 గంటలకు హెలిపాడ్ వద్దకు చేరుకున్నారు. 12.40 గంటలకు తిరిగి హైదరాబాద్‌కు బయలుదేరారు.



సభా వేదిక పై నుంచి ప్రసంగిస్తున్న రాష్ట్రపతి ద్రౌపదీముర్ము



సభకు హాజరైన చేనేత కార్మికులు

ఇంధన పొదుపులో కోదాడ డిపోకు పురస్కారం



పురస్కారం అందుకుంటున్న డీఎం శ్రీహర్ష

కోదాడఅర్బన్ : ఇంధన పొదుపు విభాగంలో కోదాడ ఆర్టీసీ డిపోకు పురస్కారం లభించింది. బుధవారం హైదరాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో తెలంగాణ స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ అవార్డు కింద వెండి బహుమతిని టీఎస్ రెడ్కో చీఫ్ ఆఫీసర్ చందస్ మిత్ర చేతుల మీదుగా డిపోమేనేజర్ దేవులపల్లి శ్రీహర్ష అందుకున్నారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ ఇంధన పొదుపులో తమ డిపోకు రాష్ట్ర స్థాయిలో బహుమతి రావడం హర్షణీయమన్నారు. ఉద్యోగుల విధినిర్వహణకు ఇది నిదర్శనమన్నారు. కార్యక్రమంలో ఎంఎఫ్‌డీ సుగుణాకర్, కేఎంపీఎల్ మెకానిక్ శివకుమార్, ఎస్‌డీఐ జీఎంరావు, కోదాడ ఉత్తమ డిపో ఉత్తమ డ్రైవర్ ఎస్‌కె రంజాన్ పాల్గొన్నారు.

జాగా కరువాయే..

కోదాడలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి స్థలం కొరత

- గుడిబండ వద్ద స్థల పరిశీలన చేస్తున్న అధికారులు
- అంత దూరంలో వద్దంటున్న పట్టణ వాసులు
- 30 పడకల ఆస్పత్రి స్థలంలోనే బహుళ అంతస్తు నిర్మించాలని డిమాండ్
- వైద్యశాల స్థలంలో ఆక్రమణలూ తొలగించాలని వినతి

కోదాడ: కోదాడ పట్టణానికి మంజూరైన వంద పడకల వైద్యశాల నిర్మాణానికి స్థలం దొరకడం లేదు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే వంద పడకల వైద్యశాల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని ఎన్నికల సమయంలో ప్రస్తుత ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలు ప్రకటించిన విషయం విదితమే. దానికి అనుగుణంగా వైద్యశాల నిర్మాణానికి స్థలం సేకరించాలని అధికారులను ఆదేశించారు. వంద పడకల వైద్యశాల నిర్మాణానికి 5 ఎకరాల స్థలం కావాల్సి ఉంది. కానీ పట్టణ సమీపంలో అంత భూమి లేకపోవడంతో అధికారులు సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలాలను పరిశీలిస్తున్నారు. కానీ అవి పట్టణానికి నాలుగైదు కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. అంత దూరంలో వైద్యశాల నిర్మిస్తే పట్టణ ప్రజలకు సౌకర్యంగా ఉండదని పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

గుడిబండ పాత లెప్రసీ వైద్యశాల స్థలం పరిశీలన

కోదాడ మండలం గుడిబండ వద్ద పాత లెప్రసీ వైద్యశాల వద్ద దాదాపు ఐదున్నర ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇది పట్టణానికి 4 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఇప్పటికే ఇక్కడ మూడెకరాల స్థలాన్ని కోర్టు ఉద్యోగుల నివాసాలకు కేటాయించగా ఇంకా రెండున్నర ఎకరాలు మిగిలి ఉంది. రెండు రోజుల క్రితం కోదాడ ఆర్డీఓ ఈ స్థలాన్ని పరిశీలించి సర్వే చేయించారు. రెండున్నర ఎకరాలు ఉన్నట్లు గుర్తించారు.ఇక్కడ వైద్యశాల నిర్మిస్తే పట్టణానికి దూరంగా ఉంటుందని రోగుల రాకపోకలకు ఇబ్బంది అవుతుందని, అక్కడ ఏర్పాటు చేయాలనే ఆలోచనను విరమించుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



కోదాడ ప్రభుత్వ వైద్యశాల

బహుళ అంతస్తుల భవనం నిర్మించాలని డిమాండ్

ప్రస్తుతం కోదాడ పట్టణ నడిబొడ్డున 30 పడకల ప్రభుత్వ వైద్యశాల ఉంది. ఈ వైద్యశాలకు 1967లో దాత రెండెకరాల స్థలం ఇచ్చారు. ఇందులో అరఎకరానికి పైగా ఆక్రమణకు గురైంది. ఈ వైద్యశాలలోనే రిలయన్స్ సెల్ టవర్, వాటర్ ట్యాంక్, గుడి నిర్మాణం చేయడంతో స్థలం ఇరుకుగా మారింది. దీనికి తోడు తమ పూర్వికులు ఇచ్చిన స్థలం కన్నా ఎక్కువగా ఉందని దాత వారసులు చెప్పడంతో అధికారులు అందులో నుంచి 520 గజాలను వారికి ఇవ్వడంతో ఇంకా ఇరుకుగా మారింది.

ఇలా చేస్తే కూడా..

కోదాడలో 30 పడకల వైద్యశాల సమీపంలో మూడెకరాల ఎన్ఎస్‌పీ స్థలాన్ని ఇటీవల కోర్టు భవన నిర్మాణానికి కేటాయించారు. ఇక్కడ ఇంకా పనులు మొదలు పెట్టలేదు. అలాగే గుడిబండ రోడ్డులో ఉన్న లెప్రసీ వైద్యశాల వద్ద ఉన్న ప్రభుత్వ భూమిలో మూడెకరాలను కోర్టు ఉద్యోగుల వసతికి కేటాయించారు. ఇంకా ఇక్కడ మరో రెండు ఎకరాల భూమి ఉంది. ఇందులోనే కోర్టు భవనం కూడా నిర్మిస్తే ఉభయతారకంగా ఉంటుందని, కోదాడ పట్టణంలో కోర్టుకు కేటాయించిన స్థలాన్ని వంద పడకల వైద్యశాలకు కేటాయిస్తే ప్రజలకు అందుబాటులో ఉంటుందంటున్నారు.

బహుళ అంతస్తుల భవనం నిర్మించాలి



వైద్యశాల ప్రజలకు అందుబాటులో ఉండాలి. అర్ధరాత్రి కూడా వెళ్లేలా పట్టణం మధ్యలో ఉండాలి. ప్రస్తుత వైద్యశాల స్థలంలో ఆక్రమణలు తొలగించి అక్కడ బహుళ అంతస్తుల భవనం నిర్మిస్తే ఎంతో ఉపయోగకరం.

–కుదరవల్లి బసవయ్య, సామాజిక కార్యకర్త, కోదాడ

అనువైన స్థలంలోనే నిర్మిస్తాం



అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో వంద పడకల వైద్యశాల నిర్మాణ పనులు ప్రారంభిస్తాం. వైద్యశాలను అందరికీ ఆమోదయోగ్యమైన స్థలంలోనే నిర్మించేలా చర్యలు తీసుకుంటాం. దీనిపై మంత్రి ఉత్తమ్‌తో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటాం.

– నలమాద పద్మావతిరెడ్డి, కోదాడ ఎమ్మెల్యే

జనవరిలో ఆపరేషన్ స్మైల్

- ఎస్పీ రాహుల్ హెగ్డే



మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట క్రైం: వచ్చే నెలలో ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎస్పీ రాహుల్ హెగ్డే తెలిపారు. పదో విడత ఆపరేషన్ స్మైల్‌కు సంబంధించి జిల్లా పోలీస్ కార్యాలయంలో అధికారులతో బుధవారం నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆపరేషన్ స్మైల్ నిర్వహణకు సూర్యాపేట, కోదాడ సబ్ డివిజన్ల వారీగా పోలీస్ టీమ్స్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పోలీస్ టీమ్స్ చైల్డ్ వెల్ఫేర్, లేబర్, హెల్త్ డిపార్ట్మెంట్లు, పోలీస్ టీమ్స్, ఐసీడీఎస్, భరోసా సెంటర్ సిబ్బంది సమన్వయంతో పని చేసి నిరాదరణకు గురైన పిల్లలను గుర్తించాలన్నారు. మెకానిక్ షాప్స్, ఇండస్ట్రీలు, వలస కూలీలు, ఇటుకల తయారీ పరిశ్రమలు, మైన్స్, హోటల్స్, దాబాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామన్నారు. వెట్టిచాకిరీకి గురవుతున్న బాలలను గుర్తించి సంరక్షణ కేంద్రాలకు తరలించడం లేదా తల్లిదండ్రులకు అప్పగించనున్నట్లు తెలిపారు. బాలలను వేధింపులకు గురిచేసినా, వెట్టిచాకిరీ చేయిస్తునా, ఇతర ఏ రకంగా నిరాదరణకు గురి చేసినా అలాంటి వారి సమాచారాన్ని డయల్ 100, చైల్డ్ హెల్ప్ లైన్ 1098కి ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు, డీఎస్పీ రవి, సీడబ్ల్యూసీ చైర్మన్ రమణారావు, లేబర్ కమిషనర్ మంజుల, డీఎంహెచ్‌ఓ కోటాచలం, జిల్లా సంక్షేమ అధికారి జ్యోతిపద్మ, చైల్డ్ వెల్ఫేర్ అధికారులు రవికుమార్, నాగరాజు, నాగుల్‌మీరా పాల్గొన్నారు.

ప్రజల అవసరాలకు అనుగుణంగా చర్యలు చేపట్టాలి



సూర్యాపేట పట్టణంలో ట్రాఫిక్ పాయింట్లను పరిశీలిస్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట క్రైం: ప్రజల అవసరాలకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు. బుధవారం సూర్యాపేట పట్టణంలో ట్రాఫిక్ పాయింట్లను పరిశీలించి ట్రాఫిక్ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ప్రజల అవసరాల దృష్ట్యా వాహనాల రద్దీ బాగా పెరుగుతోందని దానికి అనుగుణంగా పోలీసు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నాగభూషణం, ట్రాఫిక్ ఎస్ఐ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల్లో యాంటీ నార్కోటిక్ కమిటీలు

- కలెక్టర్ వెంకట్రావు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావు, చిత్రంలో ఎస్పీ రాహుల్‌హెగ్డే

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : విద్యా సంస్థల్లో యాంటీ నార్కోటిక్ కమిటీలు ఏర్పాటు చేయాలని తద్వారా మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నిరోధానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్. వెంకట్రావు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎస్పీ రాహుల్‌హెగ్డేతో కలిసి యాంటీ నార్కోటిక్ కో ఆర్డినేషన్ కమిటీ జాయింట్ యాక్షన్‌ప్లాన్‌పై నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఇతర రాష్ట్రాల నుంచి డ్రగ్స్ అక్రమంగా తరలిరాకుండా జిల్లా సరిహద్దుల్లో గట్టి నిఘా ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో ఎక్కడ కూడా గంజాయి సాగు కాకుండా చర్యలు తీసుకోవాలని డీఎఫ్ఓ సతీష్ కుమార్‌కు సూచించారు. కళాశాలల్లో అధ్యాపకులు కమిటీలు ఏర్పాటు చేసుకొని అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని డీఈఓ అశోక్, ఇంటర్మీడియట్ అధికారి కృష్ణయ్యలను ఆదేశించారు. అవగాహన ర్యాలీ ఏర్పాటు చేయాలని డీడబ్ల్యూఓ జ్యోతి పద్మను ఆదేశించారు. ఎస్పీ మాట్లాడుతూ గంజాయి సాగుపై వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ అనిత, డీఎస్పీ రాములు, డీఎంహెచ్‌ఓ కోటాచలం, డీపీఓ యాదయ్య, డీఏఓ రామారావు నాయక్ ,డ్రగ్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్, ఆర్డీఓలు జగదీష్ రెడ్డి, సూర్యనారాయణ పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తే పీడీ యాక్ట్

జిల్లాలో నాసిరకం, కల్తీ విత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని కలెక్టర్ ఎస్. వెంకట్రావు హెచ్చరించారు. పాలకవీడు మండలం దొండపాడు రైతులు 1,321ఎకరాల్లో నకిలీ మిర్చి విత్తనాలను నాటి మోస పోయామని ఫిర్యాదు చేశారు. దీంతో సంబంధిత అధికారులు, ఎస్పీ రాజీవ్‌హెగ్డేతో కలిసి రైతులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. దొండపాడు ఘటనపై ఆర్డీఓ, డీఎస్ఓ, డీఎస్పీ, అగ్రికల్చర్ ఏఓలతో కమిటీ ఏర్పాటు చేస్తామని, విచారణ జరిపి నివేదిక అందించాలన్నారు. సమావేశంలో డీహెచ్‌ఓ శ్రీధర్ గౌడ్, రైతులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో పెండింగ్ పనులను సత్వరమే పూర్తి చేయాలని కలెక్టర్ ఎస్. వెంకట్రావు ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో పనుల పురోగతి, నిధుల లభ్యత, పెండింగ్ పనులపై మున్సిపల్ కమిషనర్లు సంబంధిత ఇంజనీర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్ సీహెచ్. ప్రియాంకతో కలసి కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. సమావేశంలో సీపీఓ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్లు రామనుజులరెడ్డి, వెంకటేశ్వర నాయక్, దండు శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గోదావరి జలాలు విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న దేవిడ్‌కుమార్

నూతనకల్: తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని గ్రామాలకు గోదావరి జలాలను విడుదల చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం. దేవిడ్‌కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం నూతనకల్ మండల కేంద్రంలోని గునగంటి సత్యనారాయణ విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శ్రీరాంసాగర్ రెండో దశ ద్వారా చెరువులు, పంట పొలాలకు నీటిని విడుదల చేయాలన్నారు. రైతులకు రైతుబంధు పథకాన్ని అమలు చేయడంతో పాటు కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి ఉద్యోగభద్రత కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు పెద్దింటి రంగారెడ్డి, గంటా నాగయ్య, బొడ్డు శంకర్, కునుకుంట్ల శంకర్, కిరణ్‌కుమార్, దేసోజు మధు, మున్నా అశోక్, సంజీవరెడ్డి, లింగయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముగ్గురు గంజాయి విక్రేతల అరెస్ట్

కోదాడరూరల్ : కోదాడ పట్టణంలో గంజాయి సేవిస్తూ , విక్రయిస్తున్న ముగ్గురు యువకులను బుధవారం పోలీసులు పట్టుకున్నారు. కోదాడ పట్టణానికి చెందిన అవిడి రాఘవ, ముడియాల వీరసాయిరెడ్డి, గంధం సునీల్‌లు జల్సాలకు అలవాటు పడి గంజాయికి బానిసయ్యారు. వారు ఏపీలో గుర్తుతెలియని వ్యక్తుల వద్ద గంజాయిని కొనుగోలు చేసి కొంత వారు సేవించి మరికొంత ఒక ప్యాకెట్‌ను రూ.500 విక్రయిస్తున్నారు. వారం కిందట దాచేపల్లిలో గంజాయిని కొనుగోల చేసి కొంత సేవించి మిగిలినది విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం గంజాయిని తీసుకొని స్కూటీపై వస్తుండగా హుజూర్‌నగర్ ఫ్లెక్షైవర్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా పట్టుబడినట్లు తెలిపారు. వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రాము తెలిపారు.

ఉరేసుకుని బలవన్మరణం

కోదాడరూరల్ : ఉరేసుకుని ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన కోదాడలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కోదాడ పట్టణ పరిధిలోని లక్ష్మీపురం కాలనీకి చెందిన ఇరగదిండ్ల వెంకన్న అలియాస్ గోపి(24) హైదరాబాద్‌లో ఆటోనడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తాగుడుకి బానిసైన అతను ఈ నెల 18న విజయవాడ గుడికి వెళ్లొస్తానని భార్యకు చెప్పి లక్ష్మీపురానికి వచ్చాడు. మంగళవారం సాయంత్రం తల్లి వద్ద నుంచి సొంత ఇంటికి వచ్చి సోదరుడికి ఫోన్ చేసి చనిపోతున్నాని చెప్పాడు. మరో చోట ఉన్న సోదరుడు, తల్లి తెలిసిన ఓ వ్యక్తిని అక్కడి పంపించేటప్పటికే ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని వేలాడుతూ కనిపించాడు. కిందకు దించి చూసేవరకు మృతిచెంది ఉన్నాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కోదాడ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య స్వప్న ఫిర్యాదు మేరకు ఎస్ఐ యాదవేందర్ రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మాదక ద్రవ్యాల రవాణాను అరికడతాం

- కోదాడ డీఎస్పీ ప్రకాష్



కౌన్సిలింగ్‌లో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రకాష్

హుజూర్‌నగర్ : మాదక ద్రవ్యాల రవాణాను అరికడతామని కోదాడ డీఎస్పీ ప్రకాష్ అన్నారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలో గంజాయి అక్రమ రవాణా, వినియోగించే వారికి బుధవారం పోలీస్ స్టేషన్ ఆవరణలో కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి చెడు మార్గంలో ప్రయణించొద్దని చెప్పారు. ఉన్నత చదువులు చదివి, ఉద్యోగాలపై దృష్టి పెట్టి జీవితంలో స్థిరపడాలని సూచించారు. మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణా సంబంధిత నేరాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంచి, కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐ రామలింగారెడ్డి, ఎస్ఐలు హరికృష్ణ, వెంకటరెడ్డి, బాలకృష్ణ, పరమేష్, లింగయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



రాష్ట్రపతికి స్వాగతం పలుకుతున్న చేనేత జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతు కె.జెండగే



బాలాజీ ఫంక్షన్ హాల్‌లో చేనేత చీరలను పరిశీలిస్తున్న రాష్ట్రపతి ద్రౌపదిముర్ము



శ్రీరంజన్ యూనిట్‌లో పోచంపల్లి ఇక్కత్ చీరను పరిశీలిస్తున్న రాష్ట్రపతి

చేనేతలతో రాష్ట్రపతి మమేకం

భూదాన్‌పోచంపల్లి : రాష్ట్రపతి ద్రౌపదిముర్ము చేనేత కార్మికులతో మమేకమయ్యారు. బుధవారం భూదాన్‌పోచంపల్లి పర్యటనకు వచ్చిన ఆమె చేనేత కళాకారుల వస్త్రాలు, నూలు తయారీని పరిశీలించారు. కార్మికులను ఆప్యాయంగా పలుకరిస్తూ.. వస్త్రాల తయారీ విధానాన్ని తెలుసుకున్నారు.

స్వాగతం పలికిన మంత్రులు, అధికారులు

రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రాష్ట్ర చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పుష్పగుచ్ఛం ఇచ్చి ఘన స్వాగతం పలికారు. వారితోపాటు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మి శ్రీనివాస్, కేంద్ర జౌళి శాఖ సెక్రటరీ రచన సాహూ, రాష్ట్ర చేనేత జౌళిశాఖ డైరెక్టర్ అలుగు వర్షిణి, కలెక్టర్ హనుమంత్ కె.జెండగే తదితరులు రాష్ట్రపతికి పుష్పగుచ్ఛం అందజేశారు. మంత్రి సీతక్క రాష్ట్రపతితో కలిసి చాపర్‌లోనే వచ్చారు. రాష్ట్రపతి హైదరాబాద్‌కు వెళ్తున్న సమయంలో హెలిపాడ్ సమీపంలో ఉన్న ప్రజలను చూసి వారికి అభివాదం చేస్తూ ముందుకు సాగారు.



రాష్ట్రపతికి చేనేత చీరను బహూకరిస్తున్న మంత్రి సీతక్క, పొట్టబత్తిని సుగుణ

కట్టుదిట్టమైన భద్రత

రాష్ట్రపతి దౌపది ముర్ము పోచంపల్లి పర్యటన భారీ బందోబస్తు నడుమ సాగింది. కమెండోలు, ఎన్‌ఎస్‌జీ, రాష్ట్ర పోలీసులు అడుగడునా పహారా నిర్వహించారు. హెలిపాడ్, బాలాజీ ఫంక్షన్ హాల్ సమీపంలో, స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి అయ్యప్ప దేవాలయం వరకు మెయిన్‌రోడ్డుకు అడ్డంగా బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఈ మార్గం గుండా వెళ్లే వాహనాలను జెవీ వెంచర్ గుండా దారి మళ్లించారు. పాసులు ఉన్న వారినే అధికారులు సభా ప్రాంగణంలోనికి అనుమతించారు. ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు పాసులున్న చేనేత కార్మికులందరూ బాలాజీ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణానికి చేరుకున్నారు. పాసులు లేని కారణంగా స్థానిక మీడియా ప్రతినిధులు, ప్రజలెవ్వరిని అనుమతించలేదు. ఉదయం 10 గంటల తరువాత పాసులున్న వారిని కూడా సభలోకి అనుమతి ఇవ్వలేదు. మొదటిసారిగా రాష్ట్రపతి పోచంపల్లికి వస్తున్న నేపథ్యంలో ఆమెను చూసేందుకు స్థానిక ప్రజలు భారీగా సభాస్థలికి చేరుకున్నారు. అక్కడ కనీసం రాష్ట్రపతిని చూసే అవకాశం లేకపోవడంతో చాలా మంది భవనాలు ఎక్కి తిలకించారు.



గాయపడిన ఉప్పల్ ట్రాఫిక్ ఏసీపీని వాహనంలో ఎక్కించి పంపిస్తున్న పోలీసులు

నిరాశచెందిన 'వెదిరె' వారసులు

పోచంపల్లి పర్యటనలో భాగంగా రాష్ట్రపతి వినోబాభావే మందిరాన్ని సందర్శిస్తారని, అలాగే టూరిజం ప్రాంగణంలో ఉన్న ఆచార్య వినోబాభావే, ప్రథమ భూదాత వెదిరె రాంచంద్రారెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తారని అధికారులు ప్రకటించారు. వినోబాభావే మందిరానికి, విగ్రహాలకు రంగులు వేసి ముస్తాబు చేశారు. అయితే భద్రత సమస్య కారణంగా చివరి సమయంలో వినోబాభావే మందిరం సందర్శన రద్దయ్యింది. బాలాజీ ఫంక్షన్‌హాల్ లోని చరఖా రూమ్‌లో ఏర్పాటు చేసిన ఆచార్య వినోబాభావే చిత్రపటానికి రాష్ట్రపతి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అయితే, వంద ఎకరాలు దానం చేసి భూదానోద్యమానికి అంకురార్పణ చేసిన ప్రథమ భూదాత వెదిరె రాంచంద్రారెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పించకపోవడంతో వెదిరె కుటుంబ సభ్యులు గంగిడి చంద్రప్రకాశ్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు.

భారీ బందోబస్తు..

రాష్ట్రపతి పర్యటన సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కమెండోలు, ఎన్‌ఎస్‌జీ, రాష్ట్ర పోలీసులు పహారా నిర్వహించారు. హెలిపాడ్, బాలాజీ ఫంక్షన్ హాల్ సమీపంలో, స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి అయ్యప్ప దేవాలయం వరకు మెయిన్‌రోడ్డుకు అడ్డంగా బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఈ మార్గం గుండా వెళ్లే వాహనాలను జెవీ వెంచర్ గుండా దారి మళ్లించారు.



చేనేత మగ్గాలను పరిశీలిస్తున్న రాష్ట్రపతి ద్రౌపదిముర్ము



రాష్ట్రపతిని చూసేందుకు భవనాలపై నిల్చున్న ప్రజలు

కుటుంబ సభ్యులు మందలించారని..

- రైలు కిందపడి విద్యార్థి ఆత్మహత్య



శ్రీనాథ్ (ఫైల్)

మిర్యాలగూడ అర్బన్: కుటుంబ సభ్యులు మందలించారని ఓ విద్యార్థి రైలు కిందపడి బలవన్మరణానికి పాల్పడ్డాడు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ముప్పారం గ్రామానికి చెందిన గుంటుపల్లి శ్రీనాథ్(15) మిర్యాలగూడ పట్టణంలోని ఎస్టీ వెల్ఫేర్ హాస్టల్లో ఉంటూ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నాడు. శ్రీనాథ్ రెండు రోజులుగా పాఠశాలకు వెళ్లకుండా పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్లో వడ్డించేందుకు క్యాటరింగ్ బృందంతో కలిసి వెళ్లాడు. శ్రీనాథ్ పాఠశాలకు హాజరు కావడం లేదని హాస్టల్ సిబ్బంది అతడి తల్లికి సమాచారం అందించారు. శ్రీనాథ్‌ను కుటుంబ సభ్యులు ఫోన్‌లో అతడిని మందలించారు. మనస్తాపం చెందిన శ్రీనాథ్ మంగళవారం రాత్రి 10:30 గంటల సమయంలో హాస్టల్ నుంచి బయటకు వచ్చి మిర్యాలగూడ రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం రైల్వే సిబ్బంది గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలాన్ని పరిశీలించిన పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ హుస్సేన్ తెలిపారు.

అజ్ఞాతంలోకి చిట్‌ఫండ్ వ్యాపారి?

కోదాడ: కోదాడలో ప్రైవేట్ చిట్టీలను నడిపే వ్యాపారి ఒకరు రెండు రోజులుగా అజ్ఞాతంలోకి వెళ్లడం స్థానికంగా సంచలనం కలిగిస్తుంది. ఇతని వద్ద చిట్టీలను వేసినవారు దాదాపు 300 వందల మంది వరకు ఉన్నారని, సదరు వ్యాపారి వారికి దాదాపు ఆరు కోట్ల రూపాయలు చెల్లించాల్సి ఉందని వాపోతున్నారు. రెండు రోజులుగా అతను కనిపించకపోవడంతో పాటు సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఉండడం, ఇంటికి తాళం వేసి ఉండడంతో చిట్‌వేసిన వారు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రంగాథియేటర్ సమీపంలోని పాఠశాల వద్ద ఉన్న తన ఇంటిని 2.20 కోట్ల రూపాయలకు ఓ వైద్యుడికి అమ్మివేసిన ఇతను మరో ఇంటిని రూ.70 లక్షల రూపాయలకు కొనుగోలు చేసి ఆ ఇంటిని కూడా నెల రోజుల క్రితం గుట్టు చప్పుడు కాకుండా అమ్మివేసినట్లు సమాచారం. ప్రస్తుతం ఇతను హైదరాబాద్‌లో ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించి బాకీ ఉన్నవారికి ఐ.పి నోటీసులు పంపేపనిలో ఉన్నట్లు సమాచారం.

ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి

శాలిగౌరారం: మండలంలోని ఆకారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘికశాస్త్రం స్కూల్‌అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న తొట్ల శంభయ్య (47) నల్లగొండలోని ఆయన నివాసంలో బుధవారం అకస్మికంగా మృతిచెందాడు. సాయంత్రం ఆయన స్వగ్రామమైన కట్టంగూరు మండలం తొట్లవారిగూడెంలో అంత్యక్రియలు జరిగాయి. శంభయ్య మృతదేహాన్ని మండల ఇన్‌చార్జి విద్యాధికారి నాగయ్య సందర్శించారు. మృతదేహంపై పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. శంభయ్య అంత్యక్రియల కోసం ప్రభుత్వం అందించిన రూ.20 వేలను బాధిత కుటింబీకులకు ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయనవెంట ఆకారం పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులతో పాటు మండలంలోని పలువురు ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉన్నారు.

గంజాయి రవాణాకు అడ్డేది ?

- తెలంగాణ-ఆంధ్రా సరిహద్దు చెక్‌పోస్టు వద్ద నిఘా శూన్యం
- బస్సుల్లో ప్రయాణికులుగా సరుకు రవాణా చేస్తున్న అక్రమార్కులు
- గంజాయి విక్రయిస్తూ తాజాగా పోలీసులకు చిక్కిన ముగ్గురు నిందితులు



రామాపురం చెక్‌పోస్టు వద్ద పట్టుబడిన గంజాయి (ఫైల్)

కోదాడ: తెలంగాణ రాష్ట్రంలోకి గంజాయి రవాణాకు రాచమార్గంగా మారిన విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై పోలీసుల తనిఖీలు నామమాత్రంగా మారాయి. దీంతో పాటు నిఘా లేక పోవడంతో అక్రమార్కులు యథేచ్ఛగా గంజాయి రవాణా చేస్తున్నారు. ఆంధ్రా, ఒడిశా సరిహద్దు (ఏఓబీ) నుంచి హైదరాబాద్, ముంబయిలకు చెందిన కొన్ని ముఠాలు ప్రయాణికుల మాదిరిగా బస్సుల్లో ప్రయాణిస్తూ గంజాయి రవాణా చేస్తున్నారు. దీనిని అరికట్టడానికి తెలంగాణ-ఆంధ్రా సరిహద్దుగా ఉన్న కోదాడ మండల పరిధిలోని రామాపురం క్రాస్ రోడ్డు వద్ద గత సంవత్సరం పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో క్వింటాళ్ల కొద్ది గంజాయి పట్టుబడింది. వందల కొద్ది కేసులు నమోదు చేశారు. ఆ తరువాత ఏమైందో ఏమోకానీ ఈ తనిఖీలను అధికారులు ఎత్తి వేశారు. తాజాగా ప్రభుత్వం గంజాయి రవాణా, డ్రగ్స్ వినియోగంపై సీరియస్‌గా ఉండడంతో మరోసారి రామాపురం క్రాస్ రోడ్డు చెక్‌పోస్టు వద్ద నిఘా పెంచడానికి అధికారులు ప్రయత్నాలు మొదలు పెట్టారు.

ఏడాది కాలంలో..

కోదాడ మండల పరిధిలోని రామాపురం క్రాస్ రోడ్డు వద్ద 2022 జూన్ నుంచి 2023 జూన్ వరకు గంజాయి రవాణా చేస్తూ వంద మందికిపైగా నిందితులు పట్టుబడ్డారు. 24/7 నిఘా ఉండడంతో వందల క్వింటాళ్ల గంజాయి 10కి పైగా కార్లు, ద్విచక్రవాహనాలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 120 కేసులు నమోదయ్యాయి. ఈ చెక్‌పోస్టు కోదాడ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుండడంతో పట్టుబడిన కేసులన్నింటినీ నమోదు చేయలేక రామాపురం క్రాస్ రోడ్డు వద్ద పట్టుబడిన గంజాయిని నడిగూడెం, కోదాడ టౌన్, అనంతగిరి, నేరేడుచర్ల పోలీస్ స్టేషన్ల పరిధిలో పట్టుబడనట్లు కేసులు నమోదు చేసేవారంటే గంజాయి ఏ స్థాయిలో రవాణా జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. పోలీసుల చర్యలతో గంజాయి రవాణాకు చాలా వరకు బ్రేక్ పడింది. తరువాత అధికారులు పట్టించుకోకపోవడం, ఎన్నికలు రావడంతో గంజాయి రవాణా మళ్లీ పుంజుకుందనే ఆరోపణలు ఉన్నాయి. తాజాగా గంజాయి విక్రయిస్తూ ముగ్గురు పోలీసులకు పట్టుబడడంతో దందా యథేచ్ఛగా సాగుతున్నట్లు తెలుస్తోంది.

సంచలన కేసును నీరుగార్చారా..?

కోదాడ చెక్‌పోస్టు వద్ద పోలీసులు గంజాయిని పట్టుకోవడంతో వారు స్థానిక నాయకులతో పైరవీలు చేయించడం మొదలు పెట్టారు. దీనిలో వస్తున్న ఆదాయాన్ని చూసిన కొందరు తామే గంజాయి రవాణా చేయడం షురూ చేశారు. వీరు తెలివిగా గ్యాస్ సిలిండర్లలో గంజాయి పెట్టి రవాణా చేస్తున్నారనే సమాచారంతో నల్లగొండ సీసీఎస్ పోలీసులు 2022 జూలై 29న నకిరేకల్ వద్ద మాటు వేసి పట్టుకున్నారు. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న సీసీఎస్ ఉన్నతాధికారి గతంలో కోదాడలో పనిచేశారు. ఈ కేసులో అప్పట్లో కోదాడలో అధికార పార్టీకి చెందిన వారు కొందరు ఉడడంతో సదరు సీసీఎస్ అధికారిపై తీవ్ర ఒత్తిడి తెచ్చి ఈ కేసులో కోదాడకు చెందిన ముఖ్యులను తప్పించారు. దీంతోపాటు సంచలనంగా మారుతుందని గ్యాస్ సిలిండర్లలో గంజాయి రవాణా విషయాన్ని కూడా నాడు పోలీసులు వెల్లడించకుండా కొందరు యువకులపై కేసు నమోదు చేసి వదిలేశారని అప్పట్లో విమర్శలు వచ్చాయి. గంజాయి రవాణాతో సంబంధం ఉన్న వారు నాటి అధికారపార్టీ నేతల అండతో కోదాడలో చెలరేగిపోయారని, కోదాడలో యువతను గంజాయికి బానిసలుగా మార్చారని వీరందరిపై చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

కోదాడలో గంజాయి లేకుండా చేస్తా..



"కోదాడ పట్టణంలో గంజాయి లేకుండా చేయడమే నా మొదటి ప్రాధాన్యత. పోలీసులతో మాట్లాడాను. త్వరలోనే దీనిపై కార్యాచరణ రూపొందిస్తాం. ఈ వ్యవహారంలో ఎవరున్నా వదిలేది లేదు. కోదాడ యువతను కాపాడేందుకు ఎంత వరకైనా వెళతాను. గంజాయి అమ్మేవారు, రవాణా చేసేవారు వెంటనే మానుకోవాలి.

– నలమాద పద్మావతి, కోదాడ ఎమ్మెల్యే

24 గంటల నిఘా ఏర్పాటు చేశాం



"కోదాడ రూరల్ పరిధిలో ఉన్న రామాపురం అంతరాష్ట్ర సరిహద్దులో ఉన్న చెక్ పోస్టు వద్ద నిఘా పెంచాము. ముగ్గురు ఎస్ఐలతో 24 గంటలు నిఘా, తనిఖీలు చేయనున్నాం. గంజాయి రవాణా చేసినా, అమ్మినా, కొనుగోలు చేసినా కఠిన చర్యలు ఉంటాయి. ప్రజలు కూడా సమాచారం ఉంటే పోలీసులకు నేరుగా చెప్పవచ్చు.

– రామకృష్ణారెడ్డి, కోదాడ రూరల్ సీఐ

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

PLOT FOR SALE

■ 800 Sq yds (120X60) East Facing 30 Feet Road సూర్యనగర్ కాలనీ, నల్లగొండ నందు అమ్మకమునకు కలదు. సంప్ర॥ సెల్: 6303025110, 9888808442 [Y-798298]

Services

■ ఋణాలు, వ్యక్తిగత, వ్యవసాయం, వ్యాపార ఋణం, తక్కువ వడ్డీ, సిబిల్ అవసరం లేదు, NPA కూడా ధరఖాస్తు చేసుకోవచ్చు. సిటికాపిటల్ సర్వీస్, విష్ణు,87690 57367. [T-223]

డాక్యుమెంట్ పోయినది

■ రామగిరి నుండి NG కాలేజికి బైక్‌పై వెళ్తుండగా మార్గమధ్యలో 878/2006 అను నెం.గల ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినది. దొరికిన వారు సంప్ర॥ గోసుల లింగయ్య S/o గోసుల వెంకటయ్య, ఇ.నెం. 10-101, గ్రా॥ ఇనుపాముల, మం॥ కేతేపల్లి, జిల్లా॥నల్లగొండ. సెల్: 9652777888 [Y-798299]

Wanted

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. Ph: 9640258899/ 9640468899 [H-793665]

■ ప్రముఖ ఏజెన్సీ అయ్యప్ప అసోసియేట్స్ నందు పనిచేయుటకు కంప్యూటర్ ఆపరేటర్స్ కం-టెలికాలర్స్ కావలెను. లేడీస్‌కి మాత్రమే. నల్లగొండ లోకల్ వారికి ప్రాముఖ్యత సంప్ర॥ 9985324485 [Y-798303]

■ నూతనంగా ప్రారంభించిన మా సంస్థలో 10th, ఇంటర్ చదివిన స్త్రీ/పులు కావలెను. జీతం: 14,000+DA5500+ఫ్రీరూం. సంప్ర: నల్గొండ. సెల్: 8519891505. [L-822256]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో లేడికేర్‌టేకర్స్, లేడినర్సులు, కాంపౌండర్స్, ఆయాలు భార్యాభర్తలు కావలెను. ఫోన్: 9391036931, 9246585901. [HA-12583]

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర॥ 9177736926. [M-1167554]

సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
నాలుగు లైన్లకు రూ. :220/- (Black & White)
అదనపు లైనుకు రూ.: 50/- మాత్రమే
5% GST అదనం
నల్లగొండ : 9912220737, 9010080143, 9010002038
మిర్యాలగూడ : 9666021744
నకిరేకల్ : 9010178203
సూర్యాపేట : 9912220740, 9010038110
కోదాడ : 9010046033
భువనగిరి : 9010073592

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.


పూత, పిందె నిలిస్తేనే మామిడిలో దిగుబడి

- అనుముల ప్రాంతీయ ఉద్యానవనశాఖ అధికారి మురళి

గుర్రంపోడు: ఉమ్మడి నల్లగొండ జిలాల్లో మామిడి తోటలు ప్రస్తుతం పూత దశలో ఉన్నాయి. నల్లగొండ జిల్లాలో రెండు వేల ఎకరాలు, సూర్యాపేటలో 12వేల ఎకరాలు, యాదాద్రి భువనగిరి జిల్లాలో 11వేల ఎకరాల్లో మామిడి తోటలు సాగవుతున్నట్లు అధికార గణాంకాలు వెల్లడిస్తున్నాయి. కొన్నేళ్లుగా మామిడిలో వాతావరణ పరిస్థితులను బట్టి పూత పిందె ఆలస్యమవుతుంది. సకాలంలో మామిడిలో పూత రప్పించడం, పూత సమయంలో ఆశించే చీడపీడలను నియంత్రించి నాణ్యమైన అధిక దిగుబడులను సాధించేందుకు అనుముల ప్రాంతీయ ఉద్యానవనశాఖ అధికారి మురళి అందిస్తున్న వివరాలు ఇలా ఉన్నాయి.

మామిడిలో పూతకు ముందు, పూత సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇలా..

- మామిడిలో జూన్ నుంచి అక్టోబర్ నెల వరకు రైతులు పాటించిన సమగ్ర సాగు పద్ధతులను బట్టి అక్టోబర్ నవంబర్,డిసెంబర్ మాసాల్లో ముదిరిన కొమ్మల్లో మొగ్గ ఏర్పడటం జరుగుతుంది. గజిల్లాలో వాతావరణ పరిస్థితులను బట్టి ఎక్కువగా డిసెంబర్, జనవరి నెలల్లో మొగ్గలు వస్తాయి.
- ఆయా రకం, వాతావరణ పరిస్థితులను బట్టి డిసెంబరు డిసెంబరు రెండవ పక్షం నుంచి జనవరి మొదటి వారం వరకు పూత మొగ్గలు రావడం మొదలవుతుంది.



పూతదశలో మామిడి చెట్టు

- నీటి వసతి ఉన్న తోటల్లో పాదుల్లో ఒక తెలికపాటి తడి ఇవ్వడం లేదా లీటరు నీటికి పొటాషియం నైట్రేట్ 10 గ్రాములు, యూరియా 5 గ్రాములు చొప్పున కలిపి చెట్టుపై పిచికారీ చేయటం వల్ల పూత మొగ్గలు దాదాపు ఒకేసారి చిగురిస్తాయి.

సమగ్ర సస్యరక్షణగ

మామిడిలో పూతకు ముందు, పూత సమయం, కాయ ఏదిగే దశలో అనేక రకాలైన పురుగులు, తెగుళ్లు ఆశించి పంటకు అపారనష్టం కలుగచేస్తాయి. అదే విధంగా సరైన నీటి యాజమాన్యం, పోషకాలు యాజమాన్యం సరిగా చేపట్టని తోటల్లో పిందెలు ఎక్కువ రాలిపోవడం , కాయ సైజు తగ్గటం, నాణ్యత తగ్గిపోవటం జరుగుతుంది.

తామర పురుగుల లక్షణాలు

పాడి పంట

ఈ పురుగులు కొత్త చిగురు వచ్చే దశలో ఆకులపై అసంఖ్యాకంగా చేరి రసాన్ని పీల్చి వేస్తాయి. దీని వల్ల చిగురు ఆకులు చాల చిన్నవిగా ఉండి ఆ తర్వాత రాలిపోతాయి. పిందె ఏర్పడే దశలో కాయపై గోకి బయటకు వచ్చి రసాన్ని పిలుస్తాయి. ఈ పురుగు ఆశించిన కాయలపై రాతిమంగు లేదా ఏనుగు మంగు ఏర్పడి కాయ నాణ్యత కోల్పోతుంది.

నివారణ : ఒక లీటరు నీటికి 1 గ్రాము ఎసిఫేట్ లేదా 1 మి.లీ. ఫాసోమిడాన్ లేదా 2 మి.లీ. రిజెంట్‌ను కలిపి పిచికారీ చేయాలి.

తెగుళ్లు.. నివారణ

లేత ఆకులు, పూకాడలపై, పూలమీద, చిరుపిందెల మీద, తెల్లని పొడరు లాంటి బూజు రాత్రి పూట చల్లని వాతావరణము మరియు పగలు వెచ్చని వాతావరణము ఉన్నప్పుడు వస్తుంది. పూలు, పిందెలు రాలిపోతాయి.

- పూమొగ్గలు కనిపించే దశలో లీటరు నీటికి 3 గ్రాముల నీటిలో కరిగే గంధకము కలిసి పిచికారీ చేయాలి.
- పూత దశలో తెగులు కనిపించిన హెక్సాకోనజోల్ 2 మి.లీ. లేదా ప్రొపికోనజోల్ 1 మి.లీ. లేదా డినోకాప్ లేదా ట్రెడిమార్ఫ్ 1 మి.లీ. చొప్పున ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

ఎరువుల యాజమాన్యం

మామిడిలో చెట్ల కత్తిరింపులు (క్యానపి మేనేజ్‌మెంట్) నీటి నిర్వహణ, అంతరకృషి, సస్యరక్షణతో పాటు సమగ్ర ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించినట్లయితే చెట్లు మంచి కాపు ఇస్తుంది. వయస్సును బట్టి ఒకక్కో చెట్టుకి ఏటా అందించాల్సిన ఎరువుల మోతాదులో క్రింద ఇవ్వనైనది.

ఆకుపచ్చ, పూతమాడు, నల్లమచ్చ తెగుళ్లు

ఈ తెగుళ్లు కొల్లేటోట్రికం గ్లియోస్పోరియాయిడిస్ అనే బూజు వల్ల వస్తుంది. వర్షాలు / పొగ మంచు అధికంగా ఉన్న సమయంలో ఇది వస్తుంది. ఈ తెగులు లేత ఆకులను, రెక్కలను, పూలను, పండ్లను ఆశించి నష్టపరుస్తుంది. ఆకుల మీద గోధుమ రంగు మచ్చలు ఏర్పడి క్రమంగా మచ్చలు పోయి ఆకులు త్వరగా పండుబారి రాలిపోతాయి. లేత రెమ్మలపై నల్లని మచ్చలు ఏర్పడి పూలగుత్తులు, పూలు మాడిపోతాయి. కాయలు రాలిపోతాయి.

నివారణ: సూర్యరశ్మి సోకేలా కొమ్మలను జూన్ – జూలై మాసంలో కత్తిరింపులు చేసి లీటరు నీటికి 3 గ్రాముల కాపర్‌ఆక్సిక్లోరైడ్ లేదా 1 శాతం బోర్డోమిశ్రం పిచికారీ చేయాలి.

- పూతకు ముందు 3 గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- పచ్చి పూత మీద 1 గ్రాము కార్బండిజమ్, 1 గ్రాము థయోఫినేట్ మిథైల్ 1 లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- పింద దశలో 2.5 గ్రాముల మండోజెల్ లేదా 2 గ్రాముల ఆంట్రకాల్ చొప్పున లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.